# విముక్తి

రాత్రి తొమ్మిదయింది. రోడ్డుమీద నడుస్తున్న నాగేశ్వర్రావు మల్లెపూల వాసనకు ఆగిపోయాడు. రోడ్డువార బండిలో పెట్టి అమ్ముతున్నది ఆమె!

"బాబు మల్లెపూలుతీసుకోండి!" అతను ఆగడం గమనించి ఆమె పిలిచింది.

నాగేశ్వర్రావు సావిత్రి గుర్తుకొచ్చింది. రోజూ అడగుతూనే ఉంటుంది – మల్లెలు తెచ్చిమ్మని. తనకు బాగా యిష్టం. కాని తను మర్చిపోతూ ఉంటాడు – తన పనుల ఒత్తిడివలన.

"ఎట్లా?"

"మీకు ఎక్కువ వేస్తానా బాబూ! " అంటూ ఆమె పొట్లం కట్టిచ్చింది. రూపాయి అంటూ చెయ్యి జాపింది.

"ఈ కాసిని రూపాయా.?"

"అదికూడా మీ క్కాబట్టి..."

"హు(! డబ్బుకు విలువలేదు." అంటూ జేబులో చెయ్యి పెట్టుకున్నాడు. ఎక్కడా చిల్లర తగల్లేదు.

ప్యాంటు జేబులోకి చెయ్యి పోనిచ్చి పర్సు తీశాడు. ఖాళీ! ఏదన్నా బాస్ యిస్తే పెట్టుకుందామనుకున్నాడు – ప్ఫ్! ఎంగిలిచేత్తో పిచ్చుకని కూడా తోలడు.

అన్ని జేబులు వెతికాడు కంగారుగా ...ఎక్కడా రూపాయి డబ్బులు తగల్లేదు.

"సారీ! డబ్బులు అయిపోయాయి." బాధపడ్తూ పొట్లం వెనక్కి ఇవ్వబోయాడు.

ఆమె కిసుక్కున నవ్వింది.

అది కసుక్కున అతని మనసులో దిగబడింది.

"మీ దగ్గర డబ్బులేడికి పోతాయి – రేపివ్వండి. "

నాగేశ్వర్రావు తల దించుకొని అక్కడనుండి కదిలాడు. చూడ్డానికి డాబుగా ఉన్నాడు. తెల్లచొక్కా తెల్లప్యాంటు – చేతిలో నల్ల కోటుతో ! కాని పైసలుమటుకు నిల్!

అతనికి తన సీనియర్పైన కోపం వచ్చింది. కనీసం నెలకోసారన్నా ఓ పాతికా పరక కూడా రాల్చడు. ఎంతో ఆశగా ఎదురుచూస్తాడు....ముఖ్యంగా క్లయింట్స్ కట్టలు ఫీజులు చెల్లిస్తున్నప్పుడు దాంట్లోంచి ఓ పచ్చనోటన్నా యిస్తాడేమోనని ఎదురుచూస్తాడు. అబ్బే ! మానవుడికి ఆ ధ్యాసే ఉండదు. అంతా జేబుల్లో కుక్కుకుంటాడు.

మల్లెల పొట్లం అందుకున్న సావిత్రికి ఆనందం వెల్లివిరిసింది.

"ఈరోజన్నా మర్చిపోకుండా తెచ్చారు."

అల్ప సంతోషి- పెళ్ళయినా ఈ ఆరు నెలల్లో ఆమె పెద్దగా కోరిందేమి లేదు. ఎప్పుడన్నా పూలుఅడిగేది....గుర్తుంటే తెచ్చేవాడు. అది ఆ సమయానికి డబ్బులుంటే!

"ఏవండీ మీకోసంగతి చెప్పాలి."

"ఏంటే?"

"మార్వాడివాడు ఈమధ్య మనింటికి వస్తున్నాడు. మీ చెల్లెలి పెళ్ళికి ఇంటి మీద అప్పు

చేశారటగదా! ఇంకా ఇరవై వేలు బాకీ ఉందట..."

నాగేశ్వర్రావు తండ్రి ముకుందరావు ఓ బడి పంతులు! తాతలనాటి ఆస్తిని భద్రంగా కాపాడుకుంటూ వస్తున్నాడు. తన సంపాదనలో కొడుకును డిగ్రీ చదివించి...లా చేయించాడు. కూతురుకు పెళ్ళి చేసేందుకు ఉన్న కాస్త పొలం అమ్మాల్సి వచ్చింది. పూర్వీకుల ఆస్తి అయిన ఇల్లు అమ్మటం యిష్టం లేక... మార్వాడి దగ్గర తాకట్టుపెట్టి డబ్బు అప్పు తెచ్చి పెళ్ళి ఘనంగా జరిపించాడు.

కొడుకు ప్రయోజకుడయ్యాడుగదా....ఈచిన్న బాకీ ఎంతలో తీర్చాల్లే అన్న మొండి ధైర్యంతో చేశాడు- అప్పు!

కానీ సంవత్సరాలు గడిచినా బాకీ తీరలేదు.

వడ్డీలపైన వడ్డీలు అయ్యాయి.

నాగేశ్వర్రావు తల్లి లక్ష్మిదేవికి ఆరోగ్యం బాగో లేకపోవడంతో... బలవంతంగా నాగేశ్వర్రావుకు పెళ్ళి చేసేసుకున్నాడు తల్లి దండ్రుల మాట కాదనలేక. తరువాత తను ఎంత పొరపాటు చేసింది తెలుస్తున్నది.

తనకు సంపాదనలేదు. తండ్రి సంపాదన ఇల్లు గడవడానికి సరిపోతుంది. పెళ్ళయిన కొత్తలో కోరికలు ఎక్కువుంటాయి! ఆమెకేం తెల్సు? తన భర్త గొప్పలాయర్ అనుకుంటుంది....చుట్టుపక్కల వాళ్ళని చూసింది. అందరిలా తన భర్త ఉంటాడనుకుంది. భర్త తనకు నగలు చేయిస్తాడు.... పట్టుచీరలు కొంటాడు అనుకుంది. కాని అతను అవేం చేయలేదు. మొదట్లో తనంటే యిష్టంలేక ఏవీ కొనలేదనుకుంది.

కాని తరువాత అర్థమైంది... మనసు లేకకాదు పరుసు లేక అని.

"ఏంటాలోచిస్తున్నారు?" ఆమె కుదిపింది.

"ఆ(! ఏం చెబుతున్నావు?"

"రేపు మార్వాడివాడు వస్తాడేమో...మామగారి దగ్గర డబ్బులున్నట్టు లేదు...మీరే ఏదో రకంగా...."

"రాని వెధవని...ఎలా ఏడిపించాలో అలా ఏడిపిస్తా...కోర్టుకీడుస్తా –పరువునష్టం దావా వేస్తా రోజూ తిరిగితే!"

"అది సమస్యకు పరిష్కారం కాదు. మనం బాకీపడి అతనిపైన దౌర్జన్యం చేస్తే ఉపయోగం ఏంటి?"

"కాని మనం ఎగ్గొట్టంగా... రవ్వంత ఓపికపట్టలేడా? ఊరికే యిచ్చాడా? అప్పేగా...మూడు రూపాయిల అధర్మ వడ్డీకిచ్చాడు. నేను తలచుకుంటే కోర్టుకీడ్చి ఏడిపించగలను".

"దీనివల్ల పోయేది మన పరువేగా!"

"అయితే ఏం చెయ్యమంటావ్!"

"వీలైతే కాస్త కాస్త యిచ్చేస్తూ రండి".

"మరిచిపోయాను చెప్పడం...ఇవ్వాళ బ్రహ్మాండమైన సూట్ గెలిచాం తెలుసా...పేరుకు మా సీనియర్...కాని అంతా వర్కువుట్‌చేసింది నేనే...అస్సలు ఆయన ఆర్నెల్లుగా సిక్‌గా ఉంటున్నాడు కదా...అయినా నేనే మొత్తం డ్రాఫ్టుచేసి...ఆర్గ్యూచేసి గెలిపించా...ఓహ్! లక్షల కేసు!"

"ఫీజుఎంత వస్తుంది?"

"ఫీజా! మా సీనియర్‌కు ఆ కంపెనీ కనీసం యాభై వేలు యిస్తుంది..."

"మరి మీకో..."

"ఆఁ! నాకు ముష్టిపడేస్తుంది జూనియర్ ఫీజని... ఓ పదహారు వేలు రావచ్చు."

"పదహారువేలే!"

"ఏం? ఎక్కువా! అస్సలుకు ఆ యాభైనాకే యివ్వాలి... సార్ ఏం చెయ్యలేదు... అంతా నేనే చూసుకున్నా!"

"పోన్లేండి... ఆపదహారు వచ్చినా చాలు! దేవుడు మనల్ని దయతలచినట్టే!" సావిత్రి అంది సంతోషంగా.

"మాదేముందోయ్! కేసులో బలముంది. గెలిచాం!" ఏకాంబరం తేలిగ్గా అన్నాడు.

పక్కనే నిల్చొని వింటున్న నాగేశ్వర్రావుకుబాధవేసింది. కేసు అంత బలమైందేమీకాదు. దీని కోసం తను చాలా కష్టపడ్డాడు. మిగతా సీనియర్ల దగ్గర కూడా కొన్ని సలహాలు తీసుకున్నాడు ఇండైరెక్ట్‌గా! చాలా పుస్తకాలు చదివాడు. కాని తన బాస్ ఒక్క ప్రశంస కూడా చెయ్యలేదు తన గురించి.

తన తోటిసీనియర్లతో కూడా తన గురించి చెప్పలేదు. అందరూఅది ఏకాంబరం గొప్పతనం అనుకుంటున్నారు.

ఆ రోజు అతను వాదించిన కేసు కొట్టివేశారు. నాగేశ్వర్రావుకు చాలా బాధవేసింది. మొదట్లోనే తనకు తెలుసు ఆ కేసు నెగ్గదని. కాని తన సీనియర్ పార్టీల దగ్గర డబ్బు గుంజేసుకున్నాడు. అందుకని దాన్ని వాయిదాల మీద వాయిదాలు వేయించుకుంటూ ఇన్నాళ్ళు కాలయాపన చేశాడు. చివరికి కేసు పోయింది.

"మా జూనియర్‌కు యింకా ఎక్స్‌పీరియన్స్‌రాలేదు. కాని ఏం చేస్తాం... అతను నేర్చుకోవాలిగా... కేసు కాస్తా పోయింది". ఏకాంబరం తన తోడి సీనియర్స్‌తో అంటూ వుంటే విని బాధపడ్డాడు నాగేశ్వర్రావు.

కాని తన బాధ ఎవరితోనూ చెప్పుకోలేడు. సీనియర్‌కు వ్యతిరేకంగా ఒక్క మాటన్నా అది కోర్టులో బాంబ్‌లాగా పేలి తన భవిష్యత్తును మట్టుపెడుతుంది. అందుకే మౌనం ఉత్తమం!

రోజూ ఉదయం ఎనిమిదికొచ్చి, భోజనానికి మధ్యాహ్నం ఓ అరగంట ఇంటికి రావడం తప్పించి... రాత్రి తొమ్మిదిదాకా ఆయన ఆఫీసులో పనిచెయ్యాలి. ఉద్దరి చాకిరి! అరవ చాకిరి!

"రావ్! మా మిసెస్ ఊరికి పోవాలి...విజయవాడకు రెండు టికెట్లు బుక్ చేయించుకురా!" ఏకాంబరం పదిసార్లు లెక్కపెట్టి టికెటు డబ్బులిచ్చాడు.

ఓ పెక్యులియర్ కేసు స్టడీ చేసి డిస్కస్ చేద్దామనుకుని రెడీ అవుతున్న నాగేశ్వర్రావు నీరుకారి పోయాడు.

అతనికి యిదేం కొత్తకాదు.

తన సీనియర్ పిల్లల్ని కాలేజిల్లో చేర్పించాడు. వాళ్ళ ఫీజులు కడూతూఉంటాడు. ఇంకా చాలా చాలా సర్వీసులు చేస్తూ ఉంటాడు. ఆఖరికి బంధువుల్ని సాగనంపుతూ ఉంటాడు... ఆహ్వానిస్తూ ఉంటాడు సేష్టన్‌కెళ్ళి!

అప్పుడప్పుడు ఇలా రిజర్వేషన్లు గట్రా చేయిస్తూఉంటాడు. బస్టాండుకు పోవాలన్నా చాలా దూరం! సిటీ బస్సులో వెళితే బాగా టైం వేస్టు అవుతుంది.

"స్కూటర్ ఉందా సార్!"

"లేదు రావు... అబ్బాయి తీసుకుపోయాడు".

ఉసూరుమంటూ వివరాలు కనుక్కుని బస్టాండుకు బయలుదేరాడు. నిజం చెప్పాలంటే...

కాని ఇప్పుడుఖరీదైన పార్టీలు వచ్చే టైం అయింది. వాళ్ళను రమ్మని అపాయింట్‌మెంట్ ఇచ్చాడు. వాళ్ళు తన ఎదురుగా ఫీజు ఇస్తే ఆయన గిల్టీగా ఫీలవుతాడు. అందుకని కూడా ఇంత అర్జెంటుగా తన్ని బయటకు తరిమి ఉండచ్చు.

మా జూనియర్ బతుకు ఏ జన్మలో చేసుకున్న పాపమో?

మూడేళ్ళు కష్టపడి లా చదివినా బయటకొచ్చి ప్రాక్టీసు పెడదామంటే ఎందుకూ పనికిరాడు. విద్యార్థిగా అతను ఓ సీనియర్ లాయర్ దగ్గర చేరి కోర్టు ప్రొసీజర్లన్ని ఆకళింపుచేసుకోవాలి. జూనియర్ యొక్క బుద్ధి సూక్షతపట్టి కోర్టు వ్యవహారాలు తెలుసుకోవాలంటే ఒకటి నుండి అయిదు సంవత్సరాలు పైనే పడుతుంది.

ఈ కాలం జూనియర్‌కు గడ్డుకాలం. ఎక్కడో ఎవరో పుణ్యాత్ములు తప్పించి చాలామంది జూనియర్లు తమ చిల్లర ఖర్చులు కూడా సంపాదించుకో లేరు. పైగా వర్క్ సిన్సియర్‌గా నేర్పేవాళ్ళు చాలా తక్కువమంది. మిగతావాటికి మటుకు జీతం భత్యం లేని నౌకరులాగా వాడుకుంటారు.

పనిమనిషి బియ్యం బాగుచేసినా మామూలు జీతంకంటే ఎక్కువ తీసుకుంటుంది. ప్లీడర్ గుమాస్తా అన్నా జీతం కాకుండా పైన సంపాదించుకుంటాడు పార్టీలను పట్టుకుని. కాని నోరు వాయలేని జూనియర్ మటుకు జరిగే అన్యాయాల్ని మౌనంగా చూస్తూ తమకూ మంచిరోజులు ముందున్నాయని ఆశగా బతికేస్తూ ఉంటాడు.

ఆ రోజు సావిత్రి సెకండ్ షోకు పోదామంటే తన దగ్గర డబ్బుల్లేవన్న సంగతి చాలా కష్టం మీద బయటపెట్టాడు.

"ఫర్వాలేదు మా నాన్న ఇచ్చిన డబ్బులు నా దగ్గర యింకా ఉన్నాయి... వాటితో పోదాం పదండి." అంటూ లేవదీసింది.

నాగేశ్వర్రావుకు భూమి ఎందుకు రెండుగా విడిపోలేదో అర్థం కాలేదు.

డిగ్రీ చదవంగానే ఏ చిన్న ఉద్యోగంలో చేరినా ఈ పాటికి ఓ నికరాదాయం ఉండేది. ప్రతి సంవత్సరం ఇంక్రిమెంట్లు వచ్చేవి. కాని డిగ్రీ తర్వాత మూడు సంవత్సరాలు ప్రొఫెషనల్ కోర్సు చేసి... అయిదు సంవత్సరాలు ఊడిగంచేసి నయా పైసా సంపాదించిలేకపోతున్నాడు.

"సావిత్రీ! నాకు మంచిరోజులొస్తాయి – నా పదహారు వేలుతొందరలోనే వస్తుందిలే! అప్పుడు నేనే నిన్ను సినిమాకి తీసుకుపోతాను– అప్పటిదాకా ఓపికపట్టు."

"మీ పదహారు వేలతో ఎన్నని తేగలరు? ఇంటి మీద బాకీ చెల్లేస్తారా? మీ నాన్న అమ్మలకు బట్టలే కొంటారా? నాకు నగలే చేయిస్తారా? మీకు కనీసం ఓ సైకిలు కొనుక్కోగలుగుతారా? ఎన్నని చేయగలరు?" ఆశ్చర్యంగా అడిగింది.

"మీ నిజానికి ఈ రోజు అది వస్తుందని ఆశపడుతున్నాను. కాని ఇన్నాళ్ళు నే చేసిందానికి మా సీనియర్ నాకు పదో వంతు యిచ్చినా నాదగ్గర కొన్ని లక్షలు–పోని... ఓ లక్ష క్యాషు ఉండేది నా ఖర్చులు పోను–ప్చ్!"

"ఏవండీ! మీరు స్వంతంగా ప్రాక్టీసు చెయ్యలేరా?"

"టైం పడుతుంది. జూనియర్ల దగ్గరికి ఎవరూరారు. మేం ఎంత ఫీజులు తక్కువ తీసుకున్నా మా దగ్గరికి రారు. సీనియర్లనే ఆశ్రయిస్తారు. కాని తమషా ఏంటంటే అక్కడ వాళ్ళు మమ్మల్నే మంచిచేసుకుంటూ ఉంటారు. నీకో సంగతి తెల్సా మా సీనియర్ సబ్జెక్టు ఎప్పుడో మర్చిపోయాడు.

తనకున్న పేరు బలం మీద నోరు పెట్టుకుని బతికేస్తున్నాడు."

సావిత్రికి ఈ కబుర్లు తప్పవు. పొద్దుటినించి చచ్చీ చెడీ వస్తాడు కాబట్టి ఆబాధ ఎవరో ఒకళ్ళ దగ్గర వెళ్ళగక్కుకోవాలి.

కోటు వేసుకొని బయటకు పోబోతున్న కొడుకును ఆపాడు ముకుందరావు.

"నాగూ! నా సర్వీసు ఇంకో ఆర్నెల్లే ఉందిరా! చేతికందివచ్చినకొడుకు నువ్వున్నావనుకున్నా కాని ... బొత్తిగా నయాపైసా కూడా ఇంట్లో ఇవ్వడం లేదు.నువ్వు నీసరదాలు – షికార్లు కాదనను ...కాని ఇంట్లో ఏముందో ఏది లేదో చూసుకుని పోతూ ఉండు". మెత్తగా మందలించాడు.

అక్కడికి తనేదో తెగసంపాదిస్తున్నట్లు ఇంట్లో ఇవ్వనట్టు.

"ఈ మధ్య ఎవరూ ఏమీ ఇవ్వలేదు నాన్నా! "

"నోట్లో నాలుకుండాలోయ్! ఎవరన్నా తెచ్చి నీకిస్తారా? నువ్వే పోయి అడిగి తీసుకోవాలి!"

"అదెలా నాన్నా! మా సీనియర్ ఫీజు వసూలు చేస్తారు...పైన నే ఎలా అడిగేది...ఆయనిస్తే తీసుకుంటా!"

"బాగుంది... మీ క్లర్కును చూసి నేర్చుకో?" విసురుగా అని లోపలికి వెళ్ళిపోయాడు.

తండ్రితో ఆ మాటలు అనిపించింది అతని బీదరికం!

నాగేశ్వరావు,సీనియర్ ఆఫీసుకు పోబుద్ధి కాలేదు, తనకు బాకీపడిన కంపెనీకి చేరుకున్నాడు.

మేనేజర్ని కలిశాడు. ఆమాటా ఈ మాటా మాట్లాడి తన ఫీజుగురించి అడిగాడు.

"అదేంటి మీకు తెలీదా? ఓ పది రోజుల కిందట మీ సీనియర్ వచ్చి తీసుకుపోయాడు".

ఆశ్చర్యపోయాడు...తనతో ఒక్క మాట కూడా చెప్పలేదు.

"మరి నా ఫీజు!"

"నీది ఆయనది కలిపి తీసుకున్నాడు...నీకు తనిస్తానన్నాడేఇవ్వలేదా?"

"సారీ!నే ఊళ్ళోలేను." బొంకాడు పరువు కాపాడుకోవడం కోసం.

తల తిరిగినట్లయింది. సీనియర్ దగ్గరికి వచ్చాడు. కోర్టులో పనులు ముగించుకొని ఆఫీసుకు చేరుకున్న తర్వాత కొంచెం మూడ్ చూసి మెల్లగా కదిపాడు సీనియర్ని.

"సార్!మనం కేసు గెల్చిన ఆ కంపెనీ...మన ఫీజు..."

"ఏ కేసు?"

"అదే సార్...లక్షలు..."

"ఓఁ! అదా! ఫీజు! ఇచ్చేశారే...!"

"మీకిచ్చారు?"

"ఆఁ !తీసుకున్నా"

"సార్ !మరి నాకు..."

సీరియస్‌గా ఏకాంబరం ఓ వంద రూపాయిల కాగితం జేబులోంచి బయటకు తీసి అతనికిచ్చాడు.

"ఖర్చులకు ఉంచు."

"సార్!ఇల్లుఅప్పు తీర్చాలి...నాన్నగారు కొంచెం ఇబ్బందుల్లో ఉన్నారు. కొంచెం చూడండి సార్ !" బ్రతిమాలుతూ అన్నాడు.

"అయితే నన్నేం చెయ్యమంటావయ్యా! ఇంకో వంద అప్పు ఇమ్మంటావా! యిస్తా! అయినా మేం జూనియర్లుగా ఉన్నప్పుడు యిలా సీనియర్ల దగ్గర చెయ్యి చాచేంవాళ్ళంకాదయ్యా! మీరు మా దగ్గర చేరేది పని నేర్చుకోవడానికే! దానికేం మీ దగ్గర మేం ఫీజు తీసుకోవడం లేదు ఫ్రీగానే నేర్పిస్తున్నాం!" ఏకాంబరం విసుగ్గా చెప్పాడు.

"సార్! జూనియర్ ఫీజు ...పదహారు వేలు..."

"షటప్! ఎవడయ్యా నీకు చెప్పింది? ఒకవేళ యిచ్చినా అది నా పలుకుబడి చూసేనయ్యా?! నేలేంది నువ్వు లేవయ్యా! ఈ వంద ఉంచు...ఇంకా ఎప్పుడన్నా కావాలన్నా అడుగు ... ఇస్తా!" ఏకాంబరం లోపలికి వెళ్ళాడు.

నాగేశ్వర్రావుకు నిరాశ నిస్పృహ ముంచు కొచ్చాయి.

తను ఇన్నాళ్ళు దేనిమీద కలలు కన్నాడో అది కూడా సీనియర్ మింగేశాడు.

లక్షలకు లక్షలు వస్తుం ది! అయినా తమ ఫీజుకు కూడా కక్కుర్తిపడాలా!

కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి వచ్చి సావిత్రికి జరిగింది చెప్పి భోరున ఏడ్చాడు.

"ఏవండీ! రేపటినుండి మీరు మీ సీనియర్ దగ్గరికి వెళ్ళద్దు. ఇక్కడే బోర్డుకట్టండి. వచ్చినంత వస్తుంది...రాలేదూ...ఇంకా మీ సీనియర్ దగ్గర దాస్యం చేసున్నాననుకోండి... ఎన్నాళ్ళు ఈ జీతభత్యం లేని కొలువు. ఇందిరాగాంధీ వెట్టిచాకిరి నిర్మూలించినా మీకు తప్పలేదు ఇన్నాళ్ళు. ఇంక నే పోనీను." ఆవేశంగా అంటున్న సావిత్రిని ఆశ్చర్యంగా చూశాడు- విప్పారిన నేత్రాలతో.

